క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులకు అందించేందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి శుక్రవారం కమలాపురంకు వస్తున్నారని నగర కమిషనర్ రాముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నవరత్నాల్లో వైఎస్సార్ పెన్షన్ కానుక ఒకటని, ఈనెల నుంచి వృద్ధులకు, వితంతువులకు రూ.3000 చొప్పున ఇవ్వనున్నారు. ఈ పెంచిన పెన్షన్ కానుకను లబ్ధిదారులకు అందించడానికి ఎమ్మెల్యే హాజరు కానున్నారన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని పంచాయతీల సెక్రటరీలు, ఇతర శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

గండిలో నంద్యాల ఎంపీ



ఎంపీ పి.బ్రహ్మానందరెడ్డికి స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

చక్రాయపేట : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రంలోని వీరాంజనేయస్వామిని గురువారం నంద్యాల ఎంపీ పి.బ్రహ్మానందరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి ఎంపీ పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఎంపీకి స్వామివారి చిత్రపటం ఇచ్చి శేష వస్త్రంతో ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి ఘన నివాళి

వేంపల్లె : ఉర్దూ భాష అధ్యాపకురాలు షేక్ ఆస్మా సిద్ధిక ఆకస్మిక మరణం చాలా బాధాకరమని కళాశాల ప్రిన్సిపాల్ సి.యోగాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మృతురాలు షేక్ ఆస్మా సిద్ధిక చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

నేడు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

వల్లూరు : మండలంలోని పైడికాలువ గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని ఎంపీడీవో జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. పైడికాలువలోని ఆర్‌సీఎం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో జరిగే ఈ వైద్య శిబిరంలో పలువురు వైద్య నిపుణులు వైద్య సేవలను అందిస్తారన్నారు. సచివాలయ పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల సంబరాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. గురువారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ పెద్దల సమక్షంలో వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పులివెందులలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాణా సంచా పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దొంగతనాలపట్ల అప్రమత్తంగా ఉండాలి



వ్యక్తిని అరెస్టు చేసి చూపుతున్న ఎస్‌ఐ రోషన్, పోలీసు సిబ్బంది

సింహాద్రిపురం : దొంగతనాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ఎస్.కె.రోషన్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బంగారు ఆభరణాలు దొంగతనం చేసిన వ్యక్తిని ఆయన మీడియా ఎదుట హాజరుపరిచి మాట్లాడారు.

జంగంరెడ్డిపల్లెకు చెందిన ఎల్.అరుణ, భర్త సైమన్ ఇంటిలో బంగారు దొంగతనం జరిగిందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సింహాద్రిపురం మండలం సుంకేసుల బస్టాఫ్ వద్ద అనుమానస్పదంగా ఉన్న వ్యక్తిని పట్టుకోగా.. అతని వద్ద ఒక బంగారు చైను, ఒక జత కమ్మలు, ఒక ఉంగరం ఉన్నాయని.. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటుందన్నారు. ముద్దాయి బంగారు ఆభరణాలను జంగంరెడ్డిపల్లె గ్రామంలోని తన బంధువుల ఇంట్లో దొంగలించినట్లు ఒప్పుకోవడంతో బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

జూదరుల అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని పాతబస్టాండ్ సమీపంలో రవీంద్రనగర్‌కు పోయే బ్రిడ్జి కింద జూదమాడుతున్న షేక్ షబ్బీర్, మరో ఏడుగురిని సీఐ సి. భాస్కర్‌రెడ్డి, ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 51,810 నగదుతో పాటు, పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కృషి చేస్తున్నామన్నారు.

పింఛన్ పెంపుతో వృద్ధుల ముఖాల్లో చిరునవ్వులు



వేములలో పింఛన్ అందిస్తున్న మండల ఇన్‌చార్జి, ఎంపీపీ, జెడ్పీటీసీలు



చింతకొమ్మదిన్నెలో పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ఎర్రగుంట్లలో పింఛన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి



సింహాద్రిపురంలో పింఛన్‌ను అందజేస్తున్న మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

వేముల : ఎన్నికల్లో ఇచ్చిన రూ.3 వేల పింఛన్ ఇస్తానని ఇచ్చిన హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చి వృద్ధుల ముఖాల్లో చిరునవ్వులు నింపారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, ఎంపీపీ చల్లా గంగాదేవి, జెడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డిలు, పీసీబీ సభ్యులు మరకా శివకృష్ణారెడ్డిలు తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా రూ.3వేల పింఛన్‌ను లబ్ధిదారులకు పంపిణీ చేసి మాట్లాడారు. నేను మంచి చేసింటేనే ఆదరించాలని అడిగిన దేశంలో ఏకైక సీఎం వైఎస్ జగన్ అన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 4,473 మంది లబ్ధిదారులకు రూ.1.34 కోట్ల మేర నెలనెలా పింఛన్‌ను అందిస్తున్నారన్నారు. అన్ని వర్గాల వారికి అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేసి వారి అభ్యున్నతి కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించి మళ్లీ సీఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మండి మాపీరా, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటనారాయణ, రామచంద్రారెడ్డి, గంగులయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పింఛన్ లబ్ధిదారులకు రూ.3 వేలవకు పింఛన్ అందిస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకున్నారని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జెడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పెంచిన పింఛన్ల పంపిణీతో పాటు, నూతన పెన్షన్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. గత ప్రభుత్వంలో నూతన పెన్షన్లు కావాలి అంటే, ఎవరైనా చనిపోవాలి లేదా, జన్మభూమి కమిటీల సిఫారసు ఉండాలి అనేవారు. ప్రస్తుతం అర్హత ఉంటే చాలు వలంటీర్లు పార్టీలకు కులాలకు మతాలకు అతీతంగా ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, కో కన్వీనర్ కళాయాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్ఆర్ సీపీ నాయకులు, ఎంపీడీవో రవికుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో...

ఎర్రగుంట్ల : పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ పింఛన్‌ను రూ.3వేలకు పెంచారని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్ రెడ్డి అధ్యక్షతన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమంలో ఆయన పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. పట్టణ, మండల పరిధిలలో కలిపి 249 నూతన పింఛన్‌లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు తమ్మిశెట్టి బాలయ్య, కమిషనర్ పి.జగన్నాథ్, ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ, ఉప మండలాధ్యక్షులు మల్లు మోహన్‌రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు, ఎంపిటీసీ సభ్యులు, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో...

సింహాద్రిపురం : అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వు చూడటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక నూతన ఎంపీడీఓ కార్యాలయ సభా కార్యాలయంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి అధ్యక్షతన పెంచిన పింఛన్లను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3 వేలకు పెంచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసి ఆశీర్వదించాలన్నారు. మండల వ్యాప్తంగా 116 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, ఎంపీపీ అరుణ, ఎంపీటీసీ జాఫర్, మండల కో ఆప్షన్ మెంబర్ నజీర్, సర్పంచ్ రామ్మోహన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బ్రహ్మానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : మండలంలోని కత్తులూరు పంచాయతీ పరిధిలో ఉన్న తాటిమాకులపల్లె గ్రామంలో వైఎస్సార పెన్షన్ పెంపు సంబరాలను ఘనంగా నిర్వహించినట్లు మాజీ సర్పంచ్ ఆర్ఎల్వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం అవ్వాతాతలకు నాల్గవ విడతగా రాష్ట్ర ప్రభుత్వం పెంచిన రూ.3వేలను లబ్ధిదారులకు వారు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించండి



వేంపల్లెలో రేషన్ గోడౌన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జేసీ గణేష్‌కుమార్

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే రేషన్ పంపిణీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన వేంపల్లెలోని రేషన్ గోడౌన్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం సబ్సిడీతో అందించే రేషన్ బియ్యం పంపిణీ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పేద ప్రజలకు సక్రమంగా అందేలా చూడాలని ఆదేశించారు. ఎవరూ ఇబ్బందులు పడకుండా రేషన్ బియ్యం, కంది బేడలు, గొధుమ పిండి, వంట నూనె తదితర నిత్యావసర సరుకులను అందించాలన్నారు. అనంతరం ఇంటింటికి వాహనం ద్వారా పంపిణీ చేసే ఎండీయూ ఆపరేటర్లు తూకాలు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అనే విషయంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి, ఆర్ఐ శ్రీకాంత్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : రేషన్ సరుకుల పంపిణీలో అవకతవలకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని వెల్లటూరులో ఇంటింటికి సరఫరా చేస్తున్న రేషన్ పంపిణీని పరిశీలించి మాట్లాడారు. వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు తప్పని సరిగా అందించాలన్నారు. రేషన్ అందలేదని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయభాస్కర్ రాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా



ప్రజలకు పథకాల బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే ఎం. సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : సంక్షేమ పథకాలతో ప్రజలకు ఆర్థిక భరోసాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 7వ వార్డులో గురువారం మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ యర్రంరెడ్డి లావణ్య, వార్డు ఇన్‌చార్జి యర్రంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలతో కలసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేనన్ని సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ అమలు చేసి పేదల కుటుంబాల్లో ఆనందం నింపారన్నారు. పాదయాత్రలో సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యర్రంరెడ్డి విశ్వభార్గవరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు డి.సూర్యనారాయణరెడ్డి, పార్టీ నాయకులు వై.వీరారెడ్డి, వై.రాంమోహన్‌రెడ్డి, డి.వెంకటశివారెడ్డి, రామాంజనేయ రెడ్డి, వై సాంబశివారెడ్డి, నాగేంద్రారెడ్డి, నారాయణ రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో పర్యటించిన ఎమ్మెల్యే

రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో గురువారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్టీపీపీలో ఉన్న ఇంజనీర్లు, ఉద్యోగ, కార్మిక సంఘాల సభ్యులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి మాట్లాడారు. ఆర్టీపీపీలో పనిచేస్తున్న ప్రతి ఇంజనీర్‌లు, ఉద్యోగులకు, కార్మికులకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాబోయో ఎన్నికల్లో తమకు పూర్తిగా సహకరించాలన్నారు. ఎస్ఈలు, ఈఈలు, డీఈలు ఏఈలు ఇంజనీర్లు, యూనియన్ నాయకులు కలమల్ల గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై సిద్ధంగా ఉండాలి

జమ్మలమడుగు : రాబోయే ఎన్నికల నిర్వహణకు అధికారులందరూ సిద్ధంగా ఉండాలని ఆర్డీఓ జి.శ్రీనివాసులు తెలిపారు. గురువారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సభాభవనంలో ఆయన నియోజకవర్గంలోని మండల తహసీల్దార్ సెక్టోరియల్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. అధికారులు ఎన్నికల విధులు నిర్వహించేటందుకు తమ పరిధిలో రూట్ ఆఫీసర్లు, పోలింగ్ కేంద్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఓటర్ల జాబితాలో మరణించిన వారి పేర్లను తొలగించడంతోపాటు, మార్పులు చేర్పులు, కొత్తవారిని ఓటర్లగా నమోదు చేసే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి అధికారి పోలింగ్ కేంద్రాలలోని ఓటింగ్ యంత్రాలపై పూర్తిగా అవగాహనతో ఉండాలన్నారు. ఎక్కడ ఏ సమస్య వచ్చిన ఆ పోలింగ్ కేంద్రాలలో వాటిని పరిష్కరించేవిధంగా యంత్రాలపై కూడా పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న వారిని విధుల నుంచి తప్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారలు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులే అందరికీ స్ఫూర్తి ప్రదాతలు



దివ్యాంగులకు దుస్తులను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ లక్ష్మీప్రసన్న

పులివెందుల టౌన్ : విభిన్న ప్రతిభావంతులే అందరికీ స్ఫూర్తి ప్రదాతలు అని వార్డు కౌన్సిలర్ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. గురువారం అంధుల లిపి ప్రదాత లూయి బ్రెయిలీ జయంత్యోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని స్థానిక వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏపీ దివ్యాంగుల నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగరిగుట్ట 26వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీప్రసన్న హాజరై దివ్యాంగులతో కలిసి లూయి బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పేపర్ ప్లేట్ల తయారీ పరిశ్రమ ఏర్పాటు చేసిన విభిన్న ప్రతిభావంతురాలు వెంకట లక్ష్మి ఆర్థిక సాయంతో 20 మంది దివ్యాంగులకు దుస్తులను పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.రఘునాథరెడ్డి, రెడ్డి కమ్యూనిటీ డెవెలప్‌మెంట్ సొసైటీ నియోజకవర్గ కన్వీనర్ చప్పిడి కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ అధ్యక్షులు ఎం.ప్రదీప్‌రెడ్డి, ఏపీ రెడ్డి సేవా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్ రెడ్డి, వికలాంగుల నెట్‌వర్క్ కార్యదర్శి ఆర్.వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్రలు



మాట్లాడుతున్న పీహెచ్‌సీ డాక్టర్ కళ్యాణ్ దినకర్

లింగాల : మండల పరిధిలోని మురారిచింతల, గుణకణపల్లె గ్రామాల్లో గురువారం బీజేపీ నాయకులు రాజశేఖర్ ఆధ్వర్యంలో వికసిత భారత సంకల్ప యాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పీఎం జీవన్ ధన్‌యోజన, పీఎం జీవన జ్యోతి, బీమా యోజన, పీఎం సురక్ష బీమా, యోజన సుకన్య సమృద్ధి పథకం, పీఎం ఫసల్ బీమా, అటల్ పెన్షన్ యోజన పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. అనంతరం డ్రోన్ యంత్రం ద్వారా పంటలకు మందులను పిచికారి గురించి రైతులకు తెలియజేశారు.

9వ తేదీ పెన్షన్ కానుక పంపిణీ

వల్లూరు : స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో 9వ తేదీ ఉదయం 10 గంటలకు వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో జయశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని మండలంలో నూతనంగా మంజూరైన పెన్షన్లతో బాటు ప్రభుత్వం నూతనంగా రూ.3 వేలకు పెంచిన పెన్షన్‌లను లబ్ధిదారులకు అందచేస్తారన్నారు. మండలంలోని నూతనంగా పెన్షన్‌లు మంజూరైన వారితో పాటు పెన్షన్ లబ్ధిదారులు హాజరు కావాలన్నారు.

అనాథ వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కరస్పాండెంట్, విద్యార్థులు

వేంపల్లె : స్థానిక రాజీవ్ కాలనీలోని మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గురువారం స్థానిక వికాస్ స్కూలు విద్యార్థులు ఆ పాఠశాల కరస్పాండెంట్ రఫియా ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం వారికి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

80 పింఛన్లు మంజూరు

వీరపునాయునిపల్లె : మండలంలోని 15 సచివాలయాల పరిధిలో వివిధ రకాలకు సంబంధించిన నూతనంగా 80 పింఛన్లు మంజూరైనట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సచివాలయాల వారిగా మంజూరైన పింఛన్ వివరాలను తెలియజేశారు. అనిమెల 4, గంగిరెడ్డిపల్లె 3, ఇందుకూరు 8, మొయిళ్లచెరవు 8, ఎన్.పాలగిరి 13, పాయసంపల్లె 7, ఎస్.పాలగిరి 8, తలపనూరు 3, యు.రాజుపాలెం 3, ఉరుటూరు1-5, ఉరుటూరు2 -3, వీరపునాయునిపల్లె 13, వెల్దుర్తి 2 పింఛన్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు గతంలో మంజూరైన పింఛన్‌దారులకు ఈనెల 8వ తేదీన పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌కు సన్మానం



దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రసూల్‌ను సత్కరిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్

పులివెందుల రూరల్ : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం నూర్‌బాషా, దూదేకుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రసూల్ సాహెబ్‌ను మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డిలు చీనీ వ్యాపారస్తులు, రైతులు ఘనంగా సత్కరించి మాట్లాడారు. రసూల్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిలు అదేశాల మేరకు ఆయనకు ఈ పదవి దక్కిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం చేస్తాం

కమలాపురం : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆపేదిలేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కామనూరు శ్రీనివాసులురెడ్డి ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పి.చంద్రశేఖర్ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు గురువారం వారు తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని గత 23 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి చలనం లేదన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని ఆపేది లేదని వారన్నారు.

రైతులంటే జగనన్నకు ప్రాణం



జలకళ పథకం కింద ప్రభుత్వం ఖర్చు చేసిన వివరాల పత్రాలను రైతులకు అందిస్తున్న వైఎస్ కొండారెడ్డి

చక్రాయపేట : రైతులంటే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రాణమని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి వైఎస్ కొండారెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న అమలులోకి తెచ్చిన వైఎస్సార్ జలకళ కార్యక్రమంలో ఆయన పాల్గొని వైఎస్సార్ జలకళ కింద రైతుల పొలాల్లో వేసిన బోర్లకు సంబంధించి 11 మంది రైతులకు మంజూరైన మోటార్లు, పంపుసెట్లు, స్టార్టర్లు, కేబుల్ వైర్లు తదితర సామగ్రిని పంపిణీ చైసి మాట్లాడారు. రైతుల కోసం రైతు భరోసా, సున్నా వడ్డీతోపాటు జలకళ పథకాలను అమలు చేసి ఆదుకుంటున్నారన్నారు. రైతు బిడ్డలు కూడా ఉన్నత చదువులు చదవాలన్నారు. వైఎస్సార్ జలకళ కింద ఒక్కో రైతుకు సుమారు రూ.3 లక్షల వరకు జగనన్న బోరు మోటార్లు, సంబంధించిన సామగ్రి కొరకు ఖర్చు చేశారన్నారు. మళ్లీ జగనన్నను అధికారంలోకి తెచ్చుకుంటే రైతులకు మరిన్ని పథకాలు అమలులోకి తెస్తారన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ యదుభూషణ్‌రెడ్డి, ఎంపీపీ మాధవి బాలకృష్ణ, జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, ఎంపీడీఓ శివారెడ్డి, ఏపీడీ సుబ్బారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కోరుకుట, జుట్టు వ్రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్ఠు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

మార్కెట్ యార్డును అభివృద్ధి చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప

పులివెందుల రూరల్ : మార్కెట్ యార్డును అన్ని విధాలా అభివృద్ధి చేయడం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డిలు తెలిపారు. గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయ ఆవరణలో మార్కెట్ యార్డు డైరెక్టర్లతో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. మార్కెట్ యార్డులో వ్యాపారాలు చేసుకునే విధంగా రైతుల కోసం అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశామన్నారు.

చీనీ కాయల మార్కెట్‌లో సెప్టెంబర్ 10 నుంచి జనవరి 3వ తేదీవరకు 4,919.14 టన్నుల చీనీ కాయలు రైతుల వద్ద నుంచి కొనుగోలు చేసి వారికి రూ.10,02,97,982లు చెల్లించామన్నారు. ఇందుకు సహకరించిన మార్కెట్ హార్టికల్చర్ అధికారులకు, డైరెక్టర్లకు, రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ముఖ్యంగా మార్కెట్ యార్డులో చీనీ కాయల మార్కెట్, జంబో షెడ్డును ఏర్పాటు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డిలకు రైతుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. అలాగే మార్కెట్ యార్డులో కోటి రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన రైతు బజార్లు త్వరలోనే కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. ఎవరైనా కూరగాయల వ్యాపారాలు చేసుకునేవారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మార్కెట్ యార్డులో దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తిగల వారు మార్కెట్ యార్డు కార్యాలయంలో సంప్రదించాలన్నారు. క్యాక్రమంలో మార్కెట్ యార్డు సెక్రటరీ రత్నరాజు, మార్కెటింగ్ డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కు చట్టం రద్దుచేయాలంటూ నిరసన



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూ హక్కు చట్టం-2022ను వెంటనే రద్దుచేయాలంటూ బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు వద్ద నుంచి జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం, మైదుకూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించి మాట్లాడారు.

ఈ చట్టం వల్ల రైతులకు, సామాన్యులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సివిల్ కోర్టుకు కాకుండా రెవెన్యూ అధికారులు మార్చడం సరైంది కాదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం భూ హక్కు చట్టంను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

నగరంలో తనిఖీ

కడప అర్బన్: కడప నగరంలో ట్రాఫిక్ సీఐ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు గురువారం రాత్రి డ్రంకన్ డ్రైవ్‌పై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మద్యం సేవించి ఎవరైనా వాహనాలను నడిపితే వారికి బ్రీత్ ఎనలైజర్ ద్వారా తనిఖీలు చేపట్టి వారిపై చర్యలు తీసుకున్నారు.